# ఆద్యంతాలు

అవసరాల రామకృష్ణారావు

వేమండపం టీచర్సు రిజిస్టరులో సంతకాలు పెడుతున్నాం. టక్కుటక్కుమని తొందరగా నడుస్తున్న బూట్ల చప్పుడువిని అందరం ఒక్కసారే వెనకతిరిగి చూశాం. అరడుగులపొడవున్న రాచవంశానికి చెందిన ఓ తెల్లని పెద్దమనిషి. నల్లని తిరిగిన మీసాలు. అతికోపంతో మరింత ఎర్రబడిన కళ్లు.

'ఎవరండీ?' నేను తెలుగు మేష్టార్ని గోకేను.

'మన సత్యనారాయణరాజు లేడూ, ఎవరూ, మొన్న సెలక్షనులో డిటైనుచేశామూ, వాళ్ళ ఫాదరు' అతను ఎందుకొచ్చాడో అర్థంచేసుకున్నా. అస్కూలూ, యించుమించు ఆ వూరే రాజులది. ఆ సంగతి తెలియక వాడ్ని ఉంచేశారు కాబోలు. ఎంతతప్పు!

'ఆ వెధవ, ఆ దిక్కుమాలిన వె-ధ-వ' అతను ప్రతిమాటా నొక్కుతూ అన్నాడు,

'ఆ పనికిమాలిన చ-వ-ట, ఆ' అంట్లవెధవ' ఈ వాక్యాలకి కర్తలేదు. ఎవడు వెధవ? అందరూ ఒకారిమొహాలు ఒకారు చూచుకున్నాం. అందరూ హెడ్మాస్టరువైపు చూశాం. అతను అటుతిరిగి వణుకుతున్నాడు.

'దమ్మిడీ ఖరీదు చెయ్యని ఆ దౌర్భాగ్యపు వె-ధ-వ' ఇంక మాక్రైటరు ఊరుకోలేకపోయాడు.

'బాబ్బాబు మీ వాక్యాలకి కర్త కలవిచ్చి మరీ తిట్టుదురూ' అన్నాడు. ఆ వచ్చిన ఆయన హెడ్ మాస్టరువైపు చూస్తూ అన్నాడు.

'వాడేనండీ——ఆ నీచపు వెధవ, ఆ నాయుడు కొడుకు లక్ష్మింపతి. అంత చవటనే కట్టించారు కదా మావాడ్ని యెందుకు కటించలేదని?'

అందరూ అరగంట నవ్వుకున్నాం.

* * *

ఎక్కడో చదివేనో ఎవరు చెప్పారో సరిగ్గా జ్ఞాపకంలేదు.

మసకమసకగా చీకటి ఉన్నప్పుడు ఓ త్రాగుబోతు ఫుల్‌గా పట్టించి 'ఎవరినే, నే నెవరి నే?' అన్న పాటపాడుతూ పోతున్నాడు. ఓపోలీసు వచ్చి గట్టిగా రెక్క పట్టుకునేసరికి తనెవరో పూర్తిగా అర్థమయింది.

'పదరా అన్నయ్య తమ్ముడూ స్టేషనుకి' అన్నాడు పోలీసు. త్రాగుబోతు బెదరలేదు.

'మొన్ననే జోడాకోడి పుంజుల్ని అమ్మేను. అయిదురూపాయలు దగ్గరున్నాయి. ఆపళంగా ఇచ్చేస్తాను, పట్టుకుపో బెదరూ'——పోలీసు కళ్ళు ఆశతో మెరిశాయి. వీడికింకా మైకం వదిలినట్టు లేదు. అయిదు రూపాయలు ఒక్కమారే ఎవరూ ఆశచూపలేదు - పోలీసుకి ఆశ యెక్కువైంది.

'ఆఫీసరు ఊళ్ళోవున్నాడు అనక అల్లరికడి పడిపోతావ్, ఏదీ యిచ్చెయ్'

వాడు ఇవ్వనన్నాడు. లేదని బలిమాలుకున్నాడు. వాడ్ని భయపెట్టడానికి తిన్నగా స్టేషనుని యీడ్చుకెళ్లేడు. ఆఫీసరు కేకపెట్టేడు.

"ఎవరోయ్ ఆ అల్లరి? వాడ్ని యిలాపంపు" తాగుమోతు లోపలికి వెళ్ళేడు. పోలీసు ఏం విచారించలేదు. ఇలాంటికేసు పట్టుకున్నందుకు తనకి యింక్రిమెంటు రావొచ్చు. లేదా ప్రైజు రావొచ్చు. అయిదు నిముషాల్లో వాడు యివతలికొచ్చేడు.

"నువ్వు పీనాసోడివి అయిదురూపాయలకైనా ఒప్పుకున్నావ్ కావు. నీఖర్మ నేనేం చెయ్యనూ? ఆ మహారాజు రూపాయికే ఒప్పుకున్నారు. దయుంచు బెదరూ" పోలీసుకే మైకం కమ్మింది.

* * *

పై రెండింటిలో మొదటిది ఓ చిత్రమయిన సంభాషణ. రెండోది సంఘటన. ఈ రెండూ కూడా మనకు తెలిసినట్టు మొదలుపెట్టి- చుట్టూ తిప్పి తీసుకువెళ్ళి మనకు తెలియని, ఊహాకందని సముద్రంలో నవ్వులవానలో వదిలిపెట్టేయి. ఇలాంటివన్నీ చూస్తేనే ఏదీ మనచేతిలో లేదనే వేదాంతం స్ఫురిస్తుంది. అందులో అబద్ధంలేదు.

నారాయణరావు నాలుగుడబ్బులు చేసుకుందా మనుకున్నాడు. పిల్లలవాడు. అందులో తప్పేముంది? ఏంలేదు. తిన్నగా వాళ్ళింటికి వెళ్ళేడు.

"ఏమండీ, మీకు కడియంలో భూములున్నాయిటా?" అని అడిగేడు.

"లేకేం ఉన్నాయి" అంది ఆ యిల్లాలు.

"మరి ఈఏడు పంటేది?"

"ఏం పండలేదుట."

"పండకపోవడ మేమిటీ కడియంలో? చాల్చాలు కరణం తినేసి ఉంటాడు. మీకు ఏడాదికి పాలికబస్తాలు యివ్వాలిగా!"

"అవును - యీ ఏడు యివ్వలేదు"

"ఉండండి వాడిపని చెప్తాను." ఆవిడ ఏమీ అనలేదు. ఆ మరునాడు ఈయన సొంతఖర్చు పెట్టుకుని కడియం వెళ్ళేడు. "వెంటనే వెళ్ళి యింటో అంతో యిచ్చుకో, లేకపోతే నిన్ను తోసేస్తారుట" అని కరణాన్ని హడలుగొట్టేడు.

ఎనభై పల్సురేటుతో కరణం మర్నాడు వీళ్ళింట్లో ప్రత్యక్షం!

"పిల్లలవాణ్ని. ఈ ఏడు పండలేదు, పూర్తిగా ఇచ్చుకోలేను" అని ఆయనతో అన్నాడు. "దానికేముగదండీ, ఇబ్బందులు ఎవరికేనా వస్తాయి ఏమేనా కావలిస్తే చేబదులు తీసుకు వెళ్ళండి" అన్నాడు ఆ అతిమంచి యింటి యజమాని.

నారాయణరావు అనుకున్న దేమిటి, వచ్చిం దేమిటి?

* * *

ఆది, అంతం ఒక్కొక్కప్పుడు ఒక్కలాగే కనిపించవచ్చు. ఉదయమూ, సాయంకాలమూ ఆకాశం ఎర్రగా ఉండవచ్చు. తాతా మనవడూ నీడలు చూసుకోవచ్చు. కాని చూసుకుంటే, ఆలోచిస్తే అంతా అయోమయంగా కనపడుతుంది. దేనికి ఏది మొదలు? ఈ సంఘటనకి ఎలాంటి అంతంఉంటుంది? ఈ ప్రశ్నలకి జవాబులులేవు. ఉంటే కోతులకి రాజయోగం, బుద్ధిమంతులు నిరుపయోగం జరగదు. అజ్ఞానులకి ముందడుగూ, పండితుల పప్పులో అడుగూ జరగదు. అనుకున్నవి అనుకున్నట్టే జరుగుతే ఇన్ని షార్ట్ స్టోరీస్ రాయలేము, నిజం.

స్కెచ్

# మనిషి - కోతి

నిట్టల శ్రీరామమూర్తి

శంకరంగారి ఇంటిముందు ఓ చిన్న గుంపు పోగైవుంది. అంతా చుట్టూచేరి నవ్వులూ వెకవెకలూ, పకపకలూ, చప్పట్లూ ఏవిటీ కోతి చేష్టలూ వీళ్ళూనూ అని చూద్దునుగదా నిజంగా ఆ గుంపుమధ్య ఓ కోతే వుంది. దానిమొలకి తాడుకట్టి ఆడిస్తున్నాడు ఆ సాయిబు. ఆ కోతి అమెరికన్ జాకెట్టులాంటి ఓ రంగుగళ్ళ చొక్కా తొడుక్కుంది—కాలేజీ స్టూడెంటని భ్రమపడేరు గనుక!—క్రింద ఖాకీనిక్కరూ, నెత్తిమీద చిన్న ఎర్రటోపీ, చేతిలో కర్రం బీడీకూడా వుంది. సాయిబు రకరకాలుగా ఆడిస్తున్నాడు. దాని ఆటల్తోపాటు వాళ్ళూ ఆడుతున్నారు.

శంకరంగారు గచ్చుమెట్లమీద గోడకి జేర్లబడి సావకాశంగా కూర్చున్నారు ఓకాలు సగంమడిచి రెండోకాలు బార్లా జాపుతూ, పంచతొడలపైకి ఎగగట్టివుంది. వంటినిండా ధూమాలుగానే చొక్కా లేదు. నోట్లో చుట్ట. అసలు శంకరంగారి రూపు చెప్పాల్సివస్తే ఆయనకీ ఆ కోతికీ అట్టే తేడాలేదు. వాకసలు ఆయనే కోతిక్రిందా, చుట్టుప్రక్కల వాళ్ళు ఆయన్ని ఆడిస్తున్నట్లూ అనిపించింది. ఆ కోతి నవ్వుకీ, దాన్నిచూసి సకిలించే ఆయన నవ్వుకీ ఎంతో సామీప్యం వుంది. అందులో ఆ వేషంలో ఆ పోజులో ఆయన మరీ అల్లా అనిపిస్తున్నాడు. కోతికూడా ఏం తక్కువ చెయ్యటం లేదు. అది ఆయనకేసి తలచుమాస్తూ ఆయన ఎదురుగానే అన్ని వ్యవహారాలూ చేస్తూంటే (గృహయజమాని కాబట్టి ఆయనముందు సాయిబు చేయిస్తున్నా డనుకోండి) దానికీ ఆయనతోటి బంధువే అనే వూహ కలగడంలో వింతలేదు.

ఏమైతేనేం ఆట జరిగిపోతోంది అత్తగారింట్లో